క్లుప్తంగా

హామీలన్నీ నెరవేర్చా..



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఎన్నికల సమయంలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలన్నీ దాదాపు నెరవేర్చానని కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. జమా అతే ఇస్లా హింద్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన రెండు దశాబ్దాలలో జరగని రెండు కొత్త మసీదుల నిర్మాణం తన హయాంలో చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మసీదులు, మదర్ సాలు, షాదీఖానాలు అభివృద్ధి చేశామని, త్వరలోనే పెండింగ్‌లో ఉన్న ఒకటి రెండు అంశాలు కూడా పరిష్కరిస్తామని అన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడం వ్యక్తిగతంగా ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, నగర వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మన్‌ఖాన్, డైరెక్టర్లు కరీం, జాఫర్ ఖాన్, పార్టీ మైనార్టీ సెల్ ప్రతినిధులు బాషా, ఖాలీద్‌బిన్ వలీ పాల్గొన్నారు.

నేడు శ్రీపుష్పోత్సవం

బోట్‌క్లబ్: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీపుష్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీపుష్పోత్సవం సందర్భంగా అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక



రామస్వరూప్

బాలాజీచెరువు: డాక్టర్ డీవీ రాజు మల్టీఆర్గాన్ ఫౌండేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక దేవాలయం వీధిలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా డాక్టర్ కె.రామస్వరూప్, కార్యదర్శిగా డాక్టర్ బాదం బాలకృష్ణ, కోశాధికారిగా కె.రవిచంద్ర, మొదటి వైస్ చైర్మన్‌గా డాక్టర్ విజయలక్ష్మి, రెండో వైస్ చైర్మన్‌గా ఎం.విశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా ఏఏఆర్ మోహనరావు, పీఆర్వోగా పాలడుగు సుబ్రహ్మణ్యంలు రెండేళ్ల కాలపరిమితికి ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయ సమితి సమావేశం

కాకినాడ సిటీ: స్థానికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హిందూ ఉపాధ్యాయ సమితి సంఘం సమావేశం బుధవారం జరిగింది. నేటి విద్యార్థులను సంస్కరించాల్సిన బాధ్యత, నైతిక ప్రవర్తన, అందులకు అవసరమైన స్కిల్స్‌పై సమీక్షించారు. గురువుగా మన బాధ్యత ఏంటి.. ఎలా.. జాతీయ, భారతీయత వంటి అంశాలపై చర్చించారు. హిందూ ఉపాధ్యాయ సమితి అధ్యక్షుడు డేరా రాజబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పెండెం శ్రీదేవిని జిల్లా లీగల ఎడ్వయిజర్‌గా ఎన్నుకున్నారు.

అపరాల సాగుతో అదనపు ఆదాయం



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ బాబూరావు

కరప: రబీ పంట తర్వాత అపరాలు, పచ్చిరొట్ట సాగు చేసేలా రైతులను చైతన్యపరచాలని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు అన్నారు. బుధవారం నడకుదురులో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో పంటగా పెసలు, మినుము వంటి అపరాలు సాగు చేస్తే రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. సాగు పద్ధతులు, చీడ, పీడల నివారణ చర్యలను వివరించారు. అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై అందిస్తున్నామన్నారు. సర్పంచ్ డి.లలితకుమారి, ఉప సర్పంచ్ మాధవస్వామి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోమాటి ఏసుబాబు, వీఏఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.

8న రన్ ఫర్ జీసస్

కరప: ఈ నెల 8వ తేదీన నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ అధ్యక్షుడు పి.డేవిడ్‌రాజు కోరారు. బుధవారం కరపలో జరిగిన మండల పాస్టర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీస్తు పునరుద్ధానం సందర్భంగా ఏర్పాటు చేసిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో మండలంలోని సేవకులంతా పాల్గొనాలన్నారు. ఆ రోజు ఉదయం ఏడు గంటలకు గొర్రిపూడిలోని రెవరెండ్ డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్ మందిరం నుంచి పాతర్లగడ్డ, పెనగుదురు గ్రామాల మీదుగా కరపలోని రెవ.కలవల అబ్రహం మందిరం వద్దకు చేరుకుంటుందని డాక్టర్ డేవిడ్‌రాజు తెలిపారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ కన్వీనర్ పి.సత్యప్రసాద్‌బాబు, సెక్రటరీ ఆర్.ప్రతాప్‌కుమార్, ట్రెజరర్ కె.ఆనంద్‌బాబు, చైర్మన్ పి.సామ్యూల్‌రాజు పాల్గొన్నారు.

గంగ.. దాహార్తి తీర్చంగ

- జల్‌జీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికీ నీరు
- చురుగ్గా ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం
- రూరల్‌కు రూ.11 కోట్లు మంజూరు



రమణయ్యపేటలో కుళాయిలను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీదేవి, ఏఈ మారుతిరామ్

కాకినాడ రూరల్: మానవ మనుగడకు ప్రాణవాయువు ఎంత అవసరమో.. తాగునీరూ అంతే ముఖ్యం. రక్షిత నీటితోనే ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉంటోంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటోంది. ముందస్తుగానే ఇంటింటికీ కుళాయి ద్వారా నీటిని అందించే లక్ష్యంతో కాకినాడ రూరల్ మండలంలో పనులను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా మండలానికి రూ.11 కోట్ల జల్‌జీవన్ మిషన్ నిధులు మంజూరు అయ్యాయి. వాటితో ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్లు, కుళాయిలు ఏర్పాటు పనులు పూర్తి కావొస్తున్నాయి. వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పనులు ప్రారంభించేలా గత ఏడాది చివరిలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, పైపులైన్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో ఈ పనులు చకచకా చేపడుతున్నారు. ఇందులో నేమాం, కొవ్వాడ, ఇంద్రపాలెం, కొవ్వూరు, తమ్మవరం తదితర గ్రామాల్లో పైపులైన్ నిర్మాణ పనులు సుమారు రూ.4.95 కోట్లతో దాదాపు పూర్తయ్యాయి. తూరంగి, చీడిగ, సర్పవరం, రమణయ్యపేట, సూర్యారావుపేట తదితర గ్రామాలలో రూ.5.93 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మాణం జరుగుతున్నాయి. కొవ్వాడ, సూర్యారావుపేట గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణం పూర్తయ్యింది. రమణయ్యపేట తదితర గ్రామాలలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. మే నెల నాటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందించే లక్ష్యంతో పనులు పూర్తి చేయాలని సమీక్ష సమావేశాల్లో ఎమ్మెల్యే కన్నబాబు కోరడంతో పాటు ఇటీవల మండల పరిషత్ సమావేశంలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో అందరికీ తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుంది. జల్‌జీవన్ మిషన్ పనులూ పూర్తి కావొస్తుండడంతో ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు అందించనున్నారు.



కొవ్వాడలో పూర్తయిన ట్యాంక్ నిర్మాణం

త్వరలోనే ఇంటింటికీ నీరు

జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరా పనులు వేగవంతం చేశాం. వేసవిలో తాగునీటిని అందించే లక్ష్యంతో పనులు చేపట్టాం. త్వరలోనే ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేతుల మీదుగా ఇంటింటికీ కుళాయిలు ప్రారంభిస్తాం.

– మారుతిరామ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, కాకినాడ రూరల్

ఘనంగా ఉప్పాలమ్మ తీర్థం



కరపలో సారె బిందెలతో మహిళల ఊరేగింపు

కరప: కరప గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి నుంచి తెల్లవార్లూ గరగ నృత్యాలు, గారడీ, తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో జాతర నిర్వహించారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తుల వినతి మేరకు రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆలయ పునర్నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేయగా, గ్రామస్తులు ఇచ్చిన విరాళాలతో ఆలయం నిర్మాణమై, విగ్రహం ప్రతిష్ఠించిన తర్వాత తొలి తీర్థం కావడం విశేషం. కాకర శ్రీనివాస్, అమిత దంపతులు ఆలయానికి విరాళంగా ఇచ్చిన 108 బిందెలలో పండ్లు, స్వీట్లు, దుస్తులు వంటి సారెను తలపై ధరించిన మహిళలు దుర్గాదేవి ఆలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు దంపతులు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, లోహిదాస్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు.

సీఐటీయూ ధర్నా



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

కాకినాడ సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక అనుకూల విధానాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీలో జరిగిన కార్మిక కర్షక పోరాట ప్రదర్శనకు సంఘీభావంగా కాకినాడలో సీఐటీయూ నాయకులు ఆందోళన చేపట్టారు. స్థానిక మెయిన్‌రోడ్ పోస్టాఫీసు వద్ద జరిగిన ఆందోళనలో సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, ఏపీఆర్‌పీఏ పెన్షనర్ల సంఘ రాష్ట్ర కోశాధికారి సీహెచ్ సత్యనారాయణ రాజు, సీఐటీయూ నాయకులు పలివెల వీరబాబు, ఎంకే జ్యోతి, రాజేశ్వరి, భారతి తదితరులు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ పాలకులు దేశ సంపదను అదాని, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్‌పరం చేస్తున్నారని విమర్శించారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉంచాలన్నారు. శ్రామిక మహిళా నేతలు రాజేశ్వరి, బాంధవి, జ్యోతి, సరోజినీ, చామంతి, నూకరత్నం పాల్గొన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

- రూ.2.93 కోట్లతో నాడు– నేడు పనులు
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: విద్యా, వైద్య, గృహ నిర్మాణ రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. బుధవారం జగన్నాథపురంలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉన్నత పాఠశాలలో రూ.2.93 కోట్లతో నాడు–నేడు పథకంలో ప్రతిపాదించిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థిని కర్రి పద్మశ్రీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నాడు–నేడు పథకంలో నిర్మిస్తున్న పాఠశాలలను వచ్చే విద్యా సంవత్సరం నాటికి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యశ్రీని మరింత పటిష్టం చేసి, మెరుగైన, నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వెలమల మల్లేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కొప్పనాతి సత్యనారాయణ, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత తదితరులు పాల్గొన్నారు.



నాడు-నేడులో పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

ఆటో కార్మికులకు అండగా ఉంటా..

ఆటో కార్మికులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక సంజయ్‌నగర్‌లో శ్రీపిడుగులమ్మ తల్లి ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 100 మంది పేద మహిళలకు దుస్తుల పంపిణీ జరిగింది. ఇటీవల ఓ ఆటో కార్మికుడు మరణించగా అతని కుటుంబానికి రూ.లక్ష వైఎస్సార్ బీమా చెక్కును, ద్వారంపూడి ట్రస్ట్, యూనియన్ ప్రతినిధులు సమకూర్చిన మరో రూ.లక్షను బాధిత కుటుంబానికి అందజేశారు. ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కష్టాల్లో ఉన్న ఆటో కార్మికుల కోసం నగరంలోని అన్ని యూనియన్లు ఐక్యంగా పనిచేయడం సంతోషదాయకమన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు ఆలోచించని విధంగా సీఎం జగన్ నిర్ణయం తీసుకుని వాహనమిత్ర ద్వారా రూ.10 వేలు అందిస్తున్నారన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థిని కర్రి పద్మశ్రీ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, ద్వారంపూడి ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు) తదితరులు ఉన్నారు.



ఆటో కార్మికుడి కుటుంబానికి సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

క్రీడాకారిణికి సత్కారం



అభిషిక్తను సత్కరించిన అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: పాట్నాలో ఇటీవల జరిగిన మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో రజిత పతకం సాధించిన కాకినాడ రాజేంద్రనగర్‌కు చెందిన కాదులూరి అభిషిక్తను రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బుధవారం సత్కరించారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ ఆధ్వర్యంలో చైర్మన్ రత్నప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభలో ఐఎంఏ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ మాట్లాడారు. వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో రజిత పతకం సాధించడం గర్వంగా ఉందన్నారు. మరోఅతిథి రాజారపు మహేష్ మాట్లాడుతూ భువనేశ్వర్‌లో సోషయాలజీ ఆనర్స్ ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న అభిషిక్త వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించడం అభినందనీయమన్నారు. తాను 8 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనట్లు అభిషిక్త తెలిపారు. బుద్ధరాజు సత్యనారాయణ రాజు, శ్రీనగేష్, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, రాజా, అడబాల సత్యనారాయణ, రాఘవరావు పాల్గొన్నారు.

మాట తప్పని మన నేత జగన్

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: మాట తప్పని మన నేత సీఎం జగన్ అని, ఆయన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. బుధవారం గొల్లప్రోలులో నగర పంచాయతీ, మండలంలోని డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 956 డ్వాక్రా సంఘాల్లో 9,563 మంది సభ్యులకు రూ.6.36 కోట్లు, నగర పంచాయతీలోని 379 సంఘాల్లో 3,691 మంది లబ్ధిదారులకు రూ.3.18 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో కోవిడ్ కష్ట కాలంలోనూ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

ప్రభుత్వ పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో హామీలు ఇవ్వడమే తప్ప అమలు చేయడం లేదన్నారు. కల్లబొల్లి మాటలతో చంద్రబాబు ప్రజలను మోసగించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు.నగర పంచాయతీ చైర్మన్ గండ్రేటి మంగతాయారు, వైస్ చైర్మన్ తెడ్లపు అలేఖ్య, జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు, నాయకుడు అరిగెల రామయ్యదొర పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

శృంగార వల్లభునికి చక్రస్నానం

పెద్దాపురం: స్వయంభూ తొలి తిరుపతి శృంగార వల్లభునికి బుధవారం చక్రస్నానం, పూర్ణాహుతి అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు కర్రి జగదీష్, రాకుర్తి కుమారి, పుల్లేటి కుమార్‌ల ఆధ్వర్యంలో వేదపండితులు స్థానిక కోనేరులో చక్రస్నానం, అనంతరం పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవోపేతంగా హోమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా సీతారాముల రథోత్సవం



చేబ్రోలులో సీతారాముల రథోత్సవం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వేంచేసి ఉన్న సీతారాముల ఆలయం వద్ద స్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రాత్రి రథోత్సవాన్ని నిర్వహించారు. బ్యాండ్ మేళాలు, విద్యుత్ దీపాలంకరణలు, బాణసంచా కాల్పులు ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వామివారికి బుధవారం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

అమ్మవారిని తాకిన సూర్యకిరణాలు

గొల్లప్రోలు నగర పంచాయతీ రైల్వే స్టేషన్ వద్ద వేంచేసి ఉన్న శ్రీపాదాంబిక అమ్మవారిని బుధవారం ఉదయం సూర్య కిరణాలు తాకాయి. దీంతో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకూ సూర్యకిరణాలు అమ్మవారిని తాకినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పోగొట్టుకున్న సొమ్ము అందజేత



బాధితురాలికి సొమ్ము అందజేస్తున్న పోలీసులు

పిఠాపురం: ఆటో ఎక్కిన ప్రయాణికురాలు తన బ్యాగును మరిపోయి వెళ్లిపోయింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించగా మూడు గంటల్లోనే సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సమక్షంలో ఆ బ్యాగు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. గొల్లప్రోలు యూనియన్ బ్యాంకు వద్ద గోకివాడకు చెందిన డి.భవాని పిఠాపురం వరకూ ఆటో ఎక్కింది. పిఠాపురం చర్చి సెంటర్‌లో ఆమె ఆటోలో బ్యాగు మర్చిపోయి దిగిపోయింది. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆటోను గుర్తించి బ్యాగులో ఉన్న రూ.20,400 సొమ్మును భవానికి అందజేశారు.

ఆదర్శనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్

కాకినాడ రూరల్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయుడని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. బుధవారం రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కన్నబాబు మాట్లాడుతూ ఆ మహనీయుడిని అందరూ స్మరించుకోవాలన్నారు. పార్టీ నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. తిమ్మాపురం పాత ఎస్సీ పేటలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్యనారాయణ హాజరయ్యారు. కాకినాడ మూడో బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంపస్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి అడిషనల్ కమాండెంట్ సీహెచ్ భద్రయ్య పూలమాల వేసి నివాళులర్పించారు.

కరప: వలసపాకలలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ వాసంశెట్టి రామారావు, అనసూరి త్రిమూర్తులు పాల్గొన్నారు. కరప పీహెచ్‌సీ ఎదురుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంజలి ఘటించారు. ఎమ్మార్పీఎస్ రూరల్ కన్వీనర్ సవరపు సత్తిబాబు, పాల్గొన్నారు.



రమణయ్యపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ సిటీ: స్థానిక గాటీ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక అధ్యక్షుడు డోకుబుర్ర భద్రం పూలమాలలు వేశారు. వేదిక నాయకులు భువనగిరి బాలభద్రరావు, కుందేటి మోజేష్ కుమార్ పాల్గొన్నారు. స్థానిక సాంబమూర్తినగర్ రెవెన్యూ కాలనీలో మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. నాయకులు వల్లూరి సత్తిబాబు, పలివెల నవీన్, దూలపల్లి రమణ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: స్థానికంగా బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళి అర్పించారు. పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్, గట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వలసపాకలలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, నేతలు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూలో వీసీ ప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. రిజిస్ట్రార్ సుమలత, ఎస్సీ, ఎస్టీ లైజాన్ ఆఫీసర్ కుమారస్వామి పాల్గొన్నారు.

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సూపరింటిండెంట్ హేమలతాదేవి పూలమాలలు వేశారు. డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ అనిత పాల్గొన్నారు. జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.